## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలో 33కేవీ వెల్దుర్తి, 33కేవీ అనుపు, కొప్పునూరు, కేవీఎస్ ఎస్ డ్యాం, పిడుగురాళ్ల, రెంటచింతల, అగ్ని గుండాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ రామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 3వ శనివారం ఉదయం విద్యుత్ లైన్‌ల మరమ్మతులు, నేషనల్ హైవే వెరిఫికేషన్ వర్క్, వివిధ పోల్స్ ఏర్పాటు నేపథ్యంలో పైన తెలిపిన ఆయా 33 కేవీ లైన్‌ల విద్యుత్ సరఫరాను నిలిపివేయటం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి శనివారం తమకు సహకరించాలని ఆయన కోరారు.

### వరి పంట కోత ప్రయోగం



దాచేపల్లి : మండలంలోని నడికుడి, గామాలపాడు, దాచేపల్లిలో వరి పంటకోత ప్రయోగం శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారిణి దొండేటి పాప కుమారి ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న వరి పంట వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. 5 అడుగుల వెడల్పు, పొడవు విస్తీర్ణంలో వరి పంటను కోసి దిగుబడి అంచనా వేశారు. దాచేపల్లిలో 35 బస్తాలు, నడికుడి, గామాలపాడులో 37 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆరోగ్యశ్రీ కార్డుల వినియోగంపై అవగాహన



కారెంపూడి: జగనన్న ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ఈ నెల 21 నుంచి ప్రారంభం అవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి చెప్పారు. డీఎంహెచ్ఓ శుక్రవారం కారెంపూడి పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించారు. ముందుగా ప్రజలకు ఆరోగ్యశ్రీ బ్రోచర్లను పంపిణీ చేయాలని అందులోని సమాచారం తెలుసుకోవడం ద్వారా ఆరోగ్యశ్రీ కార్డులు ఏవిధంగా ఉపయోగపడతాయనే విషయం తెలుస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులు కూడా 21వ తేదీలోపే వస్తాయని 21 నుంచి కార్డుల పంపిణీ కూడా చేయాల్సి ఉంటుందన్నారు. డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీమౌనిక, సీహెచ్ఓ వి.హర్షవర్ధన్, సీహెచ్ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### సీసీఐతో రైతులకు మేలు

**యార్డు చైర్మన్ కలకండ ఆంథ్రయ్య**

దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం(సీసీఐ)లో రైతులు పత్తిపంటను విక్రయించాలని యార్డు చైర్మన్ కలకండ ఆంథ్రయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలక మండలి సమావేశం శుక్రవారం జరిగింది. రూ.66 లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు పాలకమండలి సభ్యులు ఆమోదించారు. యార్డులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లపై చర్చించారు. మార్కెట్‌యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో యార్డును మరింతగా విస్తరిస్తామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ తగుళ్ల పెదపిచ్చయ్య, యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, యార్డు డైరెక్టర్లు, సూపర్‌వైజర్లు సాంబశివరావు, వెంగయ్య పాల్గొన్నారు.

### కాళహస్తీశ్వరస్వామి శాంతి కల్యాణం



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల సందర్భంగా జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### పార్లమెంట్‌పై ఆగంతకుల దాడికి నిరసన

పెదకూరపాడు: పార్లమెంట్‌పై ఆగంతకుల దాడికి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా గోపి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వంలో పార్లమెంట్‌కే రక్షణ లేకుండా పోతుందన్నారు. ప్రధానమంత్రి వెంటనే రాజీనామా చేయాలన్నారు. దేశ భద్రత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పర ఉదయ్‌కుమార్, షేక్ మైలి, గంటా తిరుపతిరావు, శివాజీ, కోడె శివయ్య, రమేష్, మౌలాలిలు పాల్గొన్నారు.

## వైభవంగా కొనసాగుతున్న పల్నాటి ఉత్సవాలు



వీరంగమాడుతూ దైవాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న వీరాచారవంతులు





వీరుల ఆయుధాలకు పూజలు చేస్తున్న ప్రజలు



కోడిపోరును తిలకిస్తున్న ప్రజలు

పల్నాటి వీరారాధన ఉత్సవాలలో శుక్రవారం జరిగిన ప్రధానమైన కోడిపోరు నాడు పల్నాటి రణక్షేత్రం కారెంపూడి (కార్యమపూడి) జనసంద్రమైంది. పల్నాటి వీరాచారవంతులు తమ ఆచార వ్యవహారాలు నెరవేర్చుకోడానికి చివరి రోజు కావడంతో వీరాచారవంతులంతా భారీగా తరలివచ్చారు. తమ ఇంటి దైవాలైన పల్నాటి వీరుల ఆయుధాలకు అలంకారాలు చేసుకుని ఊరేగింపుగా అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామి ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో అంకాలమ్మ తల్లి దేవాలయం, వీరులగుడి భక్తులతో నిండిపోయాయి. ఇదిలా ఉంటే కోడిపోరును తిలకించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు. – కారెంపూడి

# ఘనంగా పొట్టి శ్రీరాములుకు నివాళులు

మాచర్ల: ఆంధ్రరాష్ట్ర అవతరణకు విశేష కృషి జరిపిన స్వర్గీయ పొట్టిశ్రీరాములు సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, శ్రీలక్ష్మీచెన్నకేశవ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు, యువజన అధ్యక్షులు కంభంపాటి అమర్, వాసవి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిల్లంచర్ల ఆంజనేయులు, ఆర్యవైశ్య యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి సురేష్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలో స్వర్గీయ పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, పట్టణ, యువజనసంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కజ్జం గురవయ్య, బచ్చు సుబ్బారావు, కొత్తమాసు బ్రహ్మారావు, హైటెక్ నరసింహారావు, చిన్ని వాసు, సైదారావుల తోపాటు పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

**అమరజీవి, వల్లభాయ్ పటేల్ త్యాగాలు మరువలేనివి..**

రెంటచింతల: అమరజీవి పొట్టిశ్రీరాములు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన త్యాగాలు మరువలేనివని వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య అన్నారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతులను పురస్కరించుకుని రెంటచింతలలోని రాములవారి ఆలయం సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి, పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. తెలుగు భాష మాట్లాడే ప్రజలంతా కలిసి ఉన్న ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నేటి యువత స్మరించుకుని ఆయన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య, నాళం పెదబాబు, చిన్నబాబు, గండా వెంకటేశ్వర్లు, ఆకుల నరసింహారావు, నీలం సత్యం, కొత్తా సాంబశివరావు, నారాయణపురం శ్రీనివాసరావు, బద్దిగం అప్పిరెడ్డి, గుంటక కాశిరెడ్డి, కర్నాటి కోటయ్య, గన్నవరం నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.



దోమతెరలు పంపిణీ చేస్తున్న వైఆర్ఎస్ స్కూల్ కరస్పాండెంట్ యేచూరి, వైఎస్సార్ సీపీ నాయకులు

**దుర్గిలో అమరజీవి వర్ధంతి..**

దుర్గి: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని మండల కేంద్రం దుర్గిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఏ సూరి సాయిశంకర్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రత్యేక భాషా సంయుక్త రాష్ట్రాలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షను కొనసాగించి ఆ దీక్షలోనే తుది శ్వాస విడిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములని కొనియాడారు. ఆయన త్యాగ ఫలితమే నేడు తెలుగు రాష్ట్రాల ఆవిర్భావమని తెలిపారు. బస్టాండ్ సెంటర్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి దళిత సంఘాల నాయకుడు కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాసుల లక్ష్మీనారాయణ, కప్పెర పెద్దిరాజు, కుందుర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూరి సాయిశంకర్

**కారెంపూడిలో అమరజీవికి నివాళి..**

కారెంపూడి: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘ నాయకులు శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి సేవలను కొనియాడారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, కొలిశెట్టి మల్లిఖార్జున, గుండా శ్రీనివాసరావు, యక్కల శ్రీను, కరాలపాటి సుబ్బారావు, కొత్తా బ్రహ్మేశ్వరరావు, సూరె సుబ్రమణ్యం తదితరులున్నారు.

### ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారందరిని ఒక తాటిపైకి తీసుకొని రావటం కోసం అహర్నిశలు కృషి చేశారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం ర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం ఏర్పడటం కోసం ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం వదిలిన మహోన్నతమైన వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు పసుపులేటి ఆనంద్, అజ్మీర శారద, ఆంజనేయులు, గర్నె నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాసరావు, కరాలపాడు సర్పంచ్ శివారెడ్డి పాల్గొన్నారు.

### అమరజీవి త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని వాసవీ అమ్మవారి దేవాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజల కోసం త్యాగం చేయటం ఎలానో తెలియజేసిన వ్యక్తి అమరజీవి అని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే బోర్డు డైరెక్టర్ మద్దాళి సుబ్బయ్య, ఎన్‌డీఎల్, ఆర్యవైశ్య నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి ఆశీస్సులు పొందండి





అయ్యప్పల బస్సు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పీవీఆర్

మాచర్ల : అయ్యప్పస్వామి దీక్షామాలలు స్వీకరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, మాచర్ల ఎంపీపీ కుమారుడు బూడిద శ్రీను, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షులు బి.సైదులు, సోషల్ మీడియా విభాగ పల్నాడు ఇన్‌చార్జి మెట్టు రామకృష్ణారెడ్డి, పీఆర్కే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జిలు ఎం.వెంకటేశ్వరరావు, వెంకటరమణలతోపాటు నాగరాజు, మరో 40 మంది ఇరుముడులు కట్టుకొని శబరిమలకు ప్రత్యేక బస్సులో బయలుదేరారు. శుక్రవారం స్థానిక కోదండ రామాలయం వద్ద అయ్యప్పస్వామి ఆశీస్సులు పొంది తిరిగి రావాలని కోరుతూ ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలు ప్రత్యేక పూజలు జరిపి అయ్యప్పలు బయలుదేరే బస్సు ముందు కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు.

## బైపాస్ రైల్వే బ్రిడ్జి పనులు పూర్తి కావస్తున్నాయి

**ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి**



బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పక్కన నాయకులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని బైపాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పట్టణానికి ప్రధానమైన ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. అయితే బైపాస్ రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయని తెలిపారు. గుత్తేదారులైన క్యూబ్ సంస్థ ప్రతినిధులు నిర్మాణ పనులను వేగవంతం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే పిడుగురాళ్లకు శాశ్వత ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తామని తెలియజేశారు.

**కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే బోర్డుల పరిశీలన..**

పిడుగురాళ్లరూరల్: పట్టణంలోని తుమ్మలచెరువు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే బోర్డులను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాసు బ్రహ్మానందరెడ్డి చేసిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు నిచ్చిందన్నారు. ఆయన పల్నాడు ప్రాంత ప్రజల కోసం నిరంతరం కృషి చేశారన్నారు. నాగార్జున సాగర్ నిర్మాణం చేపట్టి ఎంతో మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కాసు కుటుంబం పల్నాడు ప్రాంత ప్రజల కోసం ఎప్పుడు పాటుపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు ఉన్నం ఆంజనేయులు, జూలకంటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, క్యూబ్ సంస్థ ప్రతినిధులు ప్రసాద్, ముకేష్, ప్రేమయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి, ఎండీ లతీఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేత విభాగం జాయింట్ సెక్రటరీగా సుబ్బారావు



మాచవరం: వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన అవ్వారు సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర చేనేత విభాగ కమిటీని ఏర్పాటు చేశారు. గురజాల నియోజకవర్గం నుంచి సుబ్బారావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి తనకు పార్టీ పదవిని కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి, మండల పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వామి వివేకానంద బోధనలను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల : ప్రపంచ వ్యాప్తంగా స్వామి వివేకానంద పలు బోధనలు చేసి భారతదేశాన్ని అనేక దశాబ్దాల కిందట మొదటి స్థానంలో నిలిపినట్లు పల్నాడు జిల్లా రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. రామకృష్ణ మిషన్ స్థాపించిన సందర్భంగా పురస్కార నేపథ్యంలో స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జాగృతి కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షాకీనా, ఉపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ రవి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎహెచ్‌పీలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా అందించే వైద్య సేవలు ప్రజలకు వివరించి, సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు చక్రవర్తి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మృతి చెందిన గేదె

మాచవరం: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కొట్టేళ్ల వాగు సమీపంలోని వరిపొలాల్లో చాలా రోజులు క్రితం విద్యుత్ స్తంభం విరిగిపోయింది. వరికోత అనంతరం పొలంలో గేదెలు మేపుకునేందుకు గ్రామానికి చెందిన పోకల ఆంజినేయులు, గంధం చిన్న ఆదెయ్యలు వెళ్లారు. విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్ తీగలు తెగి పడి ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే రెండు గేదెలు మృతి చెందాయి. విషయాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయగా గతంలోనే విద్యుత్ సరఫరా నిలిపివేసామని, విద్యుత్ సరఫరా ఎలా వచ్చిందో తెలుసుకుంటామని అన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని బాధితులు తెలిపారు.

## పీవీఆర్‌కు సత్కారం



మాచర్ల: జిల్లాలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగాన్ని బలోపేతం చేసి రాష్ట్రస్థాయికి ఎదిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని అభినందిస్తూ శుక్రవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు కె.రత్నరాజు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయనతోపాటు ట్రేడ్ యూనియన్ నాయకులు కంభంపాటి మోషే, పలువురు ఎస్సీ నాయకులు, వివిధ వర్గాల వారు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

# 15 అంగన్‌వాడీ కేంద్రాలు స్వాధీనం



గోలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం స్వాధీనం చేసుకుంటున్న సూపర్‌వైజర్ నాగమణి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఇప్పటి వరకు 15 కేంద్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సూపర్‌వైజర్ నాగమణి శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కారణంగా ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రెంటచింతల మండలంలో మొత్తం 39 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని గోలి గ్రామంలో ఉన్న రెండు కేంద్రాలు, మిగిలిన చోట్ల 13 కేంద్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ళ: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని నార్నెపాడుకు చెందిన చెల్లి అనిల్‌కుమార్(19) మరో ముగ్గురితో కలిసి ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా నార్నెపాడు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తూ ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డీ కిశోర్ తెలిపారు.

## పల్నాటి ఉత్సవాలలో ఆర్యవైశ్య సంఘం సేవలు



పులిహోర పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలకు కోడిపోరు నాడు భారీగా తరలివచ్చిన భక్తులకు కారెంపూడి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు, యువజన సంఘ నాయకులు పులిహోర పంపిణీ చేశారు.